ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ ఆదివారం । 20 ఏప్రిల్ 2025 । ■ 13 పేజీలు

# నెత్తుటి జ్ఞాపకం..
# మానని గాయం



8లో

అమాయక గిరిజనుల నెత్తురు చిందిన ఇంద్రవెల్లి ఘటనకు నేటితో 44 ఏండ్లు పూర్తయ్యింది 1981, ఏప్రిల్ 20న నాటి ప్రభుత్వం జరిపిన దమనకాండ ఆదివాసుల గుండెల్లో ఇప్పటికీ నిలిచిపోయింది. తమ హక్కుల కోసం ఉద్యమించిన అడవి బిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ గురిపెట్టి తూటాల వర్షం కురిపించింది. విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో అనేక మంది గిరిపుత్రులు నేలకొరిగారు. ఆ రక్తపు మరకలు ఇప్పటికీ చెరిగిపోవడం లేదు. సమైక్య పాలకుల తీరుతో నాటి అమరులకు కనీసం నివాళులర్పించలేకపోయిన జనం, స్వరాష్ట్రంలో స్వేచ్ఛగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ యంత్రాంగం నేటి వేడుకలకు సర్వం సిద్ధం చేసింది. సంస్మరణ సభకు మంత్రి సీతక్కతో పాటు ఆదివాసీలు హాజరు కానున్నారు.

## వెంటాడతున్న జ్ఞాపకాలు



- 43ఏళ్ల తర్వాత తొలిసారిగా అధికారికంగా నిర్వహణ..
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- హాజరు కానున్న మంత్రి సీతక్క
- స్మృతివనంలో అమరుల స్థూపం
- అమాయక గిరిజనుల నెత్తురు చిందడానికి కారణమేంటి?
- నేటికీ చెరగని స్మృతులు
- ఇంద్రవెల్లి ఘటనకు 44 ఏళ్లు

1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ ఆదివాసీ మహిళ వెట్టి ఇస్తుబాయిని హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో సంకెళ్లతో బంధించి చికిత్స చేస్తున్న దృశ్యం. (44 ఏళ్ల క్రితం నాటి చిత్రం)



13

# శోక సంద్రమైన సోన్

- స్వగ్రామానికి ప్రేమ్‌సాగర్ మృతదేహం ■ కొడుకు పార్థివదేహాన్ని చూసి సొమ్మసిల్లిన తల్లి
- ఆస్పత్రికి తరలింపు ■ కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు ■ మిన్నంటిన రోదనలు
- ప్రేమ్‌సాగర్‌కు కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు..

నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌సాగర్ ఇటీవల దుబాయ్‌లో పాకిస్తాన్ యువకుడి చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే.. శనివారం సాయంత్రం ప్రేమ్‌సాగర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. పార్థివదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. కొడుకు మృత దేహాన్ని చూసి తల్లి సొమ్మల్లి పడిపోయింది. ప్రేమ్‌సాగర్ అంతిమయాత్రలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి రెడ్డి, బీజేపీ నాయకులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# 'టీం శివంగి'

- తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా నిర్మల్ జిల్లాలో మహిళా కమాండోస్..
- 45 రోజుల పాటు మహిళా కానిస్టేబుళ్లకు కఠోర శిక్షణ
- టీం శివంగిగా పేరు..
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలను అభినందించిన మంత్రి
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 'శివంగి' అమలుకు చర్యలు-13






13

# అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

- అభివృద్ధి పనుల్లో అలసత్వం ఉపేక్షించం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- నిర్లక్ష్యానికి తావులేదు.. అలాంటి కాంట్రాక్టర్లపై వెంటే చర్యలు తీసుకోవాలి
- త్వరలో అంగన్వాడీల్లో ఖాళీల భర్తీ
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష
- అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేల అసంతృప్తి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలోపంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమంపై ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. మహిళా పోలీసులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శివంగి' బృందాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇది రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీని అభినందించారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 12లో



## కళాశాల భవనంపై నుంచి దూకి..
## బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

- సూర్యాపేట జిల్లాలో ఘటన..
- మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పగడపల్లి గ్రామంలో విషాద ఛాయలు..

## పుట్టిన రోజునే
## అనంత లోకాలకు..

- గోదావరి నదికి స్నానానికి వెళ్లి యువకుడి మృతి
- ఇసుక గుంతలో పడడంతో ప్రమాదం..
- మృత దేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన -5





# వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

యాసింగి 2024-25 వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో యాసంగి వరి ధాన్యం కొనుగోలు, సన్నబియ్యం పంపిణీ, త్రాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కొరకు రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుందని, సన్నబియ్యంకు కనీస మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనంగా బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. యాసంగి సీజన్ లో 70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఇందు కొరకు రాష్ట్రంలో 8 వేల 329 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 8 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవిలో తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల నుండి తరలించడానికి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికా రులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తెలి పారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ లేని ప్రాంతా లలో వాటర్ ట్యాంకర్లు, ఇతర మార్గాల ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్.డి.ఓ. కోమల్ రెడ్డితో కలిసి హాజరుకాగా మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షల 31 వేల 935 మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి అంచనా వేయడం జరిగిందని, ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో 321 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో భాగంగా ఇప్పటి వరకు 209 కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రారంభించడం జరిగిందని, ఈ నెల 17వ తేదీ వరకు వరకు 337 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీలో భాగంగా జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి బియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ ప్రవంతి పాల్గొన్నారు.









## గత పాలకుల తప్పిదాలతో..
# అభివృద్ధిలో వెనుకబడ్డాం

- నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపాటు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆవేదన

**ముథోల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

గతంలో నియోజకవర్గ అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా నిధులు మంజూరైనప్పటికీ, అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎఫ్‌డిఆర్ ప్యాకేజీలో చింతల్‌బోరి-మహాగాం, కల్లూరు-మోత్కుపల్లి, కోతుల్‌గావ్-వాడి గ్రామాలకు వెళ్లడానికి బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, సంవత్సరాల తరబడి పనులు ప్రారంభం కాలేదన్నారు. పనులను రివైజ్ చేసి నిధులను పెంచి, వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. కాగితాల్లో ప్రోగ్రెస్ మాత్రమే ఉందని, అభివృద్ధి నత్తనడకన ఉందని అధికారుల వైఖరిని ఎండగట్టారు. జిల్లా అధికారులు సమస్యలను సీరియస్ గా తీసుకోవడం లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మారుమూల గ్రామాల్లో, తండాల్లో సమస్య తీవ్రతరంగా ఉందన్నారు. వేసవి ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం ఏంటన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పంట పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే పటేల్ సూచించిన అంశంలో సీరియస్‌గా దృష్టి సారిస్తామని, పనులను వేగవంతం చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

# సింగరేణి కార్మికులకు ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు అందరికీ ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని బీఎంఎస్ సెంట్రల్ నాయకులు, ఏబీకేఎంఎస్ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మాధవ నాయక్ కోరారు. శనివారం సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం నాయక్ కి 1992లో జెబిసిసి ఐతో యాజమాన్యం చేసుకున్న ఎం ఓ యు ప్రకారం కొత్తగా చేరిన వారందరికీ కూడా ఐడి కార్డులు జారీ చేయాలని వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒడిశాలో నైని బొగ్గు గని ప్రారంభం కావడం వల్ల సింగరేణికి వచ్చే 34 సంవత్సరాల బలమైన భవిష్యత్తు ఏర్పడిందన్నారు. ఈ గనిలో 340 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం దాదాపు 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. ఈ గనిని కేంద్ర ప్రభుత్వం 2015లో కేటాయించినప్పటికీ, గత ఒడిశా ప్రభుత్వం భూమి సేకరణ, పర్యావరణ అనుమతుల్లో ఆలస్యం చేయడం వల్ల ప్రారంభం కావడంలో అడ్డంకులు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం ఒరిస్సాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఈ గని ప్రారంభమయ్యిందన్నారు. సిఎండి బలరాం నాయక్ సమన్వయంతో కేంద్ర, రాష్ట్రాల నుంచి అవసరమైన అనుమతులు సాధించి, అత్యంత వేగంగా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం చారిత్రాత్మక విషయమని పేర్కొన్నారు. ఈయన వెంట బి.ఎం.ఎస్ కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు జీవీ కృష్ణారెడ్డి, కార్యదర్శి ఉట్ల గణేష్, శ్యామ్ లాల్ తదితరులు ఉన్నారు.




# ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకొని క్రైస్తవులు శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ నుండి ప్రారంభమై సూపర్ బజార్, రామాలయం చౌరస్తా ప్రధాన కూడలిల మీదగా ఆంధ్రాబ్యాంక్ ఏరియా సిఎస్ఐ చర్చి వరకు శాంతి ర్యాలీని నిర్వహించారు. సీఎస్ఐ చర్చి ఫాస్టర్ రెవరెండ్ ఎం.జాషువా మాట్లాడు తూ ఏసుక్రీస్తు మానవాళి రక్షణ కోసం ఈ లోకంలో జన్మించారనీ, అందరినీ సమానంగా చూడాలని, ప్రేమ,కరుణ భావాలతో మెలగాలని సూచించారు.




# ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఈవీఎం గోదాంను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్ భద్రపరుచే గోదాంను రెవెన్యూశాఖ ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా.. లేదా అన్నది పర్యవేక్షించాలన్నారు. ఈవీఎం గోదాం వద్ద ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి పాల్గొన్నారు.




# ఎస్ఎఫ్ఐ సభను జయప్రదం చేయండి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గణేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న సంఘం 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్‌లోని సంఘం కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.





# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి
- రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం
- దళారులను నమ్మి మోసపోద్దు
- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు
- గుడిహత్నూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో రబీలో రైతులు అత్యధికంగా జొన్న పంటను సాగు చేశారని, వీరందరూ కూడా మధ్య దళారులకు జొన్నలు విక్రయించి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి దనసరి సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ పీఏసీఎస్ ద్వారా చేపడుతున్న జొన్నల కొనుగోళ్లను ఆమె మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజార్షి షా అదనపు కలెక్టర్ శ్యామల దేవి, మార్క్ఫెడ్ ఇన్చార్జి డీఎం గజానంద్ లతో కలిసి ఆమె కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా జొన్నలు సాగు చేస్తారని, జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధర 3371 కల్పిస్తున్నందున రైతులు ప్రభుత్వ మార్కెట్లో నే తమ పంటను వికరించుకోవాలని కోరారు. ఎకరానికి 8.65 క్వింటాళ్ల కొనుగోలు చేయడం జరుగుతున్నప్పటికి, రైతులు డిమాండ్ కి అనుగుణంగా, జిల్లాలో పంట సాగు విస్తీర్ణం పెరిగినందున ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఎకరానికి 14 క్వింటాళ్ల ను కొనుగోలు చేసేందుకు ఒప్పుకోవడం జరిగిందనీ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 3371కు జొన్నలను కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ ప్రాంత రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తమ జొన్నలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. దళారుల మాటాలు నమ్మవద్దన్నారు. రైతులు తమ పంటను ఎండబెట్టి ఆరిన తర్వాత మార్కెట్ యార్డుకు తీసుకురావాలని, మార్కెట్ యార్డ్‌కు వచ్చేటప్పుడు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకురావాలని కోరారు.

**రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..**

ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముకోవడానికి మార్కెట్లకు వస్తే వారిని మోసం చేసేవారు ఎక్కువయ్యారని, అందుకు ప్రభుత్వం మార్కెట్ యార్డులలోనే ఏ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రతి ఏటా వారు పండించిన పంటను విక్రయించుకోనేందుకు నానా అవస్థలు పడుతున్నారని, అధికారులే ఆ అవస్థలకు గురి చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, రాజకీయాలకతీతంగా పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.

**అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తాం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

జిల్లాలో ఈ ఏడాది రవిలో జొన్న సాగు అంచనా కంటే ఎక్కువ సాగు చేయడం జరిగిందని, ఈ పంటను విక్రయించుకునేందుకు మార్కెట్ కి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సరైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ధాన్యానికి సంబంధించిన డబ్బులు త్వరగా చెల్లించే విధంగా చూడాలని సంబంధిత మార్క్ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి గజానన్, డిఏఓ శ్రీధర్ స్వామి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.











# మన్యం నుంచి.. ఉన్నత శిఖరాలకు ఎదగాలి





- యుత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- గంజాయి కేసులో చిక్కితే ప్రభుత్వ పథకాలు కట్...
- యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేసిన జిల్లా ఎస్పీ.
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

యువతకు చదువుపై ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకాంక్షించారు. మారు మూల ఆదివాసి గ్రామాలలోని ప్రజలకు వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో జిల్లా పోలీసు యంత్రాంగం తరపున గాదిగూడ మండలంలోని కొలం గూడలో జిల్లా వైద్యశాఖ సహకారంతో ఉచిత మేగా వైద్య శిబిరాన్ని శనివారం జిల్లా ఎస్పీ, డాక్టర్లు ఆదివాసీలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు గోలీలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి సమాజంలో చీడపురుగు అని, గంజాయి పండించడం వల్ల, వాడడం వల్ల సమాజ శ్రేయస్సుకు నష్టం కలుగుతుందని తెలియజేశారు. గంజాయి పండించడం వల్ల ప్రభుత్వం వల్ల వచ్చే లబ్ధిని కోల్పోతారని, గంజాయి కేసులు నమోదు చేపడతాయని తెలియజేశారు. ఉట్నూరు ఎఎస్పీ కాజల్ సింగ్, నార్నూర్ సీఐ రహీం పాషా, వైద్య సిబ్బంది, గాదిగూడ ఎస్ఐ నాగనాథ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇంద్రవెల్లి సభ పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

### ప్రభుత్వం నిషేదాజ్ఞలు ఎత్తివేయడం హర్షణీయమన్న మాజీ ఎంపీ సోయం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి కాల్పుల ఘటనలో అమరులైన వీరులను స్మరించి వారికి నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయంలో అధికారికంగా సంస్కరణ సభ నిర్వహించడం పట్ల మాజీ ఎంపీ సోయం బాపురావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆదిలాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి ఇంద్రవెల్లి సభ సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి, సభ ఏర్పాట్లపై చర్చించారు. 2004లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన రోజే రాత్రి 11 గంటల సమయంలో ఇంద్రవెల్లి స్తూపం వద్ద కొబ్బరికాయ కొట్టి నివాళులు అర్పించడం జరిగిందని, అప్పుడే తొలి అడుగు పడిందన్నారు. 40 ఏళ్లుగా నిర్బంధం మధ్య అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించే వారిమని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా నిషేధం ఎత్తివేయడం అధికారికంగా సభ నిర్వ హించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం జరిగే సంస్కరణసభకు ఆదివాసులు పెద్ద ఎత్తున తరలి రావాలని సోయం బాపూరావు కోరారు. ఆయన వెంట ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యర్తలు ఉన్నారు.

## ఉపాధి పనులకు భీం మనవడు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

కుమ్రంభీం మనవడు కుమురం సోనేరావు చేతిలో చిల్లిగవ్వలేక ఉపాధి పనులకు వెళ్తున్నాడు. ఆసిఫాబాద్(డి) దోబే గ్రామంలో నివాసముంటున్న సోనేరావు, గౌరుబాయి దంపతులు పేదరికంతో15 రోజులుగా ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. ప్రభుత్వం గతంలో ఐదెకరాల సాగుభూమి ఇచ్చినప్పటికీ.. ఎమ్మెల్యే, కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించినా ప్రయోజనం లేదన్నారు.



## గందరగోళంగా ఇందిరమ్మ కమిటీలు

**ముథోల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు గందరగోళంగా మారాయి. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీల సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ కమిటీలను గత రెండు నెలల క్రితం గ్రామ సభలో తీర్మానం చేసి అధికారుల ఆమోదం కోసం పంపించారు. మండలంలోని కారేగావ్ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఎంపిక సక్రమముగా లేదని మండల స్థాయి అధికారులను గ్రామస్తులు నిలదీశారు. గ్రామంలో గ్రామ సభలో ఎంపిక చేసిన కారేగావ్ గ్రామానికి చెందిన నారాయణ,గంగారెడ్డి పేర్లను తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.అలాగే పలు గ్రామాలలో గ్రామ సభలో ఎంపిక చేసిన కమిటీల నుంచి సభ్యుల పేర్లు గల్లంతకావడం మండల సమావేశంలో మండల స్థాయి అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎంపికైన కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఎస్సై సంజీవ్ జోక్యం చేసుకొని ఇందిరమ్మ కమిటీ జాబితా ఉన్నత స్థాయి అధికారుల నుంచి వచ్చిందని తమ ప్రమేయం ఏమీ లేదని వెల్లడించారు. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో సమస్య సద్దుమణిగింది.





## లక్ష్యానికి అనుగుణంగా
# ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టాలి

**వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర నీటి పారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి**

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
యాసంగి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్ సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా ఇప్పటి వరకు పూర్తిచేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరిట రైతులకు ఎటువంటి కోతలు పెట్టవద్దని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని అన్నారు. వానాకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు అధికారులందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. యాసంగి సీజన్‌లో 70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఇందు కొరకు రాష్ట్రంలో 8 వేల 329 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 8 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొను గోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవిలో తాగు నీటికి ఎలాంటి ఇబ్బం దులు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల నుండి తరలించడానికి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికా రులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ లేని ప్రాంతాలలో వాటర్ ట్యాంక్లు, ఇతర మార్గాల ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన వివరాలను మంత్రికి కలెక్టర్ తెలియజేశారు. నిర్ణీత సమయానికి జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా వరి కొనుగోలును నిర్వహిస్తున్నామన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ మంచిర్యాల జిల్లా కుమార్ దీపక్, సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



## జాగ్రత్తలు పాటిస్తేనే
# టీబీని అరికట్టవచ్చు

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**ఉట్నూర్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
క్షయ వ్యాధిని అరికట్టాలంటే వ్యాధి సోకిన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి టీబి ముక్త భారత్‌కు సంబంధించిన గోడ పత్రులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. టీబీ వ్యాధి ఓ అంటూ వ్యాధి అని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వాలు వ్యాధి సోకిన వారికి వెయ్యి రూపాయలు, ఉచిత నిత్యవసర సరుకులు, గిరిజనులు ఉంటే ప్రయాణ ఖర్చుల నిమిత్తం 750 రూపాయలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్, టీబీ సూపర్వైజర్ వెంకటేశ్వర్, మాజీ సర్పంచ్ తిరుపతి, సిబ్బంది సుదర్శన్, అంబారావు, వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు రాధాబాయి పాల్గొన్నారు.

# గంజాయికి అలవాటు పడి జీవితం నాశనం చేసుకోవద్దు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లిలో ఓపెన్ డ్రింకింగ్ అలవాటు అయిన యువకులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. బెల్లంపల్లి రూరల్ సిఐ అఫ్జలుద్దీన్ శనివారం ఓపెన్ డ్రింకింగ్ చేసిన యువకులకు తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ చేశారు. బంగారు మైసమ్మ టెంపుల్ ప్రాంతంలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న మంటరి శ్రీకాంత్, కారుపాకల శ్రీకర్, ఆత్రం శ్రీకాంత్, చింతపురి మధు కొండారి అంజన్నలను పోలీసులు పట్టుకున్నారు. సదరు యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సందర్భంగా రూరల్ సిఐ మాట్లాడుతూ... యువత మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి దూరాలవాట్లకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చదువుకొని జీవితంలో ఎదగాలని చెప్పారు. ఈ మేరకు పట్టుబడిన యువకులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కౌన్సిలింగ్లో తాళ్ల గురజాల ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

# బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి



**విహెచ్‌పి ఆధ్వర్యంలో నిరసన**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టం సాకుతో అల్లర్లను సృష్టిస్తున్న దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బొండ్ల నారాయణ అన్నారు. బెంగాల్ లో హిందువులపై దాడి చేసి, ముగ్గురిని చంపినా వారిని శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షులు అలోక్ కూమార్ పిలుపు మేరకు ఆదిలాబాద్‌లో వి.హెచ్.పి నేతలు నిరసన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో మమత బెనర్జీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలనా విధించాలని డిమాండ్ చేస్తూ శనివారం బైక్ ర్యాలీలో నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా సాగిన బైకు ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామల దేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ అధ్యక్షుడు బండారి సంతోష్, నాయకులు రామేశ్వర్, కార్తీ, కేంద్రే విజేయ్, దుర్గా వాహిని, రేఖ, రజిని, శారద, వినయ్, తదితరులు ఉన్నారు.



## మంచిర్యాల జిల్లాలో
## నూతన బార్‌కు
# దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఒక నూతన బార్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మంచిర్యాల ఎక్సైజ్ సీఐ గురువయ్య కోరారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఒక నూతన బార్ కి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. 2005 ఎక్సైజ్ నిబంధనల ప్రకారం గతంలో రాష్ట్ర వ్యాప్తంగా మూతపడిన 25 బార్ ల స్థానంలో కొత్త బార్ లకు అనుమతి ఇవ్వగా, మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఒక బార్‌కు అవకాశం దక్కిందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈ నెల 26లోపు కలెక్టరేట్ లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు రుసుముగా లక్ష రూపాయలు కాగా ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నెల 29న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

**గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి..**

మంచిర్యాల కార్పొరేషన్‌లో బార్ కోసం ఆసక్తి గల వారు గడువులోపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని మంచిర్యాల ఎక్సైజ్ సీఐ గురవయ్య కోరారు. దరఖాస్తు ఫారం ఏ-1కు మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ లేదా పాన్ కార్డు జిరాక్స్ లను జతపరచాలని, దరఖాస్తు రుసుము రూ.1 లక్ష( నాన్ రిఫండబుల్)తో డీడీ తీయాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 26న సాయంత్రం 5 గంటల్లోగా మంచిర్యాల లేక ఆదిలాబాద్ లేక హైదరాబాద్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. వివరాల కోసం జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (87126 58773), మంచిర్యాల ఎక్సైజ్ సీఐ (87126 58788)లలో సంప్రదించవచ్చునని సూచించారు.

# క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మాదర్శకం

**మందమర్రి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
మరణాన్ని జయించిన క్రీస్తును ప్రకటిద్దాం అంటూ క్రైస్తవ సోదరులు నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ఉత్సాహంగా సాగింది. పట్టణంలో సియస్ఐ చర్చి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్‌లో క్రైస్తవ సోద రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దొర్ల బంగ్లా ఏరియా నుండి ప్రారంభమైన ర్యాలీ సియస్ఐ చర్చి వద్ద ముగించారు. షాలోమ్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ ఏలీయా జెండా రన్ ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సియస్ఐ చర్చి పాస్టర్ రెవ.బంటు జేర్మీయా మాట్లాడుతూ... యేసు క్రీస్తు మరణం,3వ రోజున మృత్యుంజయుడై తిరిగి లేచిన సందర్భంగా కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. యేసు ప్రభువు ప్రేమ, కరుణ, త్యాగం గురించి పట్టణ పురవీధులలో వివరిస్తున్నామన్నారు. యువతి, యువకులు ఉత్సాహంగా పాల్గొని ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యేసు కోసం పరుగెడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఆనంద్, జూపాక సోల్మోన్, ముల్కల జాన్ ప్రసాద్, సంతపురి సునిల్, బత్తుల కిషోర్, కొండ రాజరత్నం, నక్కకమల్ బాబులు పాల్గొన్నారు.





# దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

**- దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఉపకరణాల పంపిణీ - మంత్రి సీతక్క**
**- ట్రై సైకిళ్లకు బదులుగా బ్యాటరీ స్కూటీలను అందించాలని కోరిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**ఇచ్చోడ, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మగౌరవమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని, దివ్యాంగులు ఆత్మ గౌరవంతో జీవించాలని ప్రభుత్వం కన్న బిడ్డల్లా చూసుకుంటున్నదని, ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేయడం జరుగుతుందనీ తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి మిల్క్ అధ్యక్షతన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించే కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై పంపిణీచేశారు. అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ట్రై సైకిల్ కాకుండా స్కూటీలను పంపిణీ చేసినట్లయితే వారికి సౌకర్యవంతంగా ఉంటుందని ప్రభుత్వం దీనిపైన సృష్టి సాధించి సరైన విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సహాయ ఉపకరణాలను తీసుకున్న లబ్ధిదారులు పునరుత్తేజంతో తమ జీవితాన్ని కొనసాగించాలని, వైకల్యం అనేది ఏదో ఒక్క అవయవానికి మాత్రమే ఉంటుంది కాబట్టి వైకల్యం ఉన్న అవయవాన్ని గురించి వేదనకు గురికాకుండా ఆరోగ్యంగా ఉన్న మిగతా అవయవాలతో ధైర్యంగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి వివిధ రకాలుగా ప్రోత్సాహకాలు, అందించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం వంటి వివిధ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం



దివ్యాంగుల కోసం వారు చిరు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా లోన్లు, ప్రత్యేకంగా వాహనాలను రూపొందించడం జరుగుతుందని, త్వరలోనే ఆ కార్యక్రమం (బ్యాట్రి సైకిల్) ప్రారంభించనున్నట్టు తెలిపారు. దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలను వివియోగించుకోవాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు మంత్రి, ఎంపీ నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా. ఎమ్మెల్యే పాయల్ శంకర్, డైరెక్టర్ శైలజ, వికలాంగుల కార్పోరేషన్ ఛైర్మెన్ వీరయ్య పాల్గొన్నారు.



## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రతిభ

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ఆదిలాబాద్ ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిసారి లాగే ఈసారి కూడా తమ ప్రతిభను చాటి ఉత్తమ.ర్యాంకులను సాధించారు. ఇందులో రాథోడ్ సచిన్ ఏఐఆర్ 3333 ర్యాంక్, శివ సాయి ఏఐఆర్ 4721, వాసు ఏఐఆర్ 6876, ఎల్. శ్రీలేఖ ఏఐఆర్ 7505, నలుమాసు అక్షాద్ ఏఐఆర్ 8071, జాదవ్ సాయి రామ్ ఏఐఆర్ 9067, రాథోడ్ సంధ్య ఏఐఆర్ 9156, రాథోడ్ పావని ఏఐఆర్ 11113, రాథోడ్ హరీష్ ఏఐఆర్ 13731 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు మరో 32 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించినట్లు.కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఉత్తమ ర్యాంకులను సాధించిన శనివారం కళాశాలలో ఎస్ఆర్ కళాశాల ఛైర్మెన వరదారెడ్డి, డైరెక్టర్స్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జోనల్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్స్ జైపాల్ రెడ్డి, అరవింద్, లలిత, అధ్యాపకులు అభినందించారు.

# నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

**ధనూర్ గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం - జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క**

**బోథ్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ధన్నూర్ గ్రామంలో శనివారం నూతన బ్రిడ్జి నిర్మాణానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరై ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమి పూజ చేశారు. అనంతరం ధన్నూర్ గ్రామంలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం నూతన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా జొన్న పంట సాగవుతుండడంతో ప్రభుత్వం ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తూ ఉంటే రైతుల అభ్యర్థన మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎకరానికి 14 క్వింటాళ్ల కొనుగోలుకు సంబంధించి జీవో వి డుదల చేశామని అన్నారు. రైతులు తాము పండించిన పంటలను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సభ ముగిసిన అనంతరం పోషణ పక్షానికి సంబంధించిన కార్యక్రమాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజాన్, ఎమ్మెల్సీ దండే విటల్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ రూరల్ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో శనివారం ఇందిరా మహిళా శక్తి భవనం, గ్రంథాలయ అదనపు షెడ్డు నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పుట్టిన రోజునే అనంత లోకాలకు..

**గోదావరి నదికి స్నానానికి వెళ్లి యువకుడి మృతి - ఇసుక గుంతలో పడి ప్రమాదం - మృత దేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన**

**కోటపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పారుపెల్లి గ్రామానికి చెందిన పూరెళ్ల అశోక్ (20) అనే యువకుడు శుక్రవారం సాయంత్రం గోదావరి నదికి స్నానానికి వెళ్లి గల్లంతు కాగా శనివారం ఉదయం నదిలో శవమై తేలాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం శుక్రవారం అశోక్ పుట్టిన రోజు సందర్భంగా నదిలో స్నానం చేసి గుడికి వెళ్లి మొక్కు తీర్చుకోవాలనుకున్నాడు. చీకటి పడినా అశోక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి నది ప్రాంతమంతా గాలించారు. ఒక చోట దుస్తులు, చెప్పులు కనబడ్డాయి. కానీ అశోక్ జాడ తెలియలేదు. చికటి పడడంతో శనివారం ఉదయం వెళ్లి అదే ప్రాంతంలో గాలిస్తుండగా అశోక్ నీటిపై శవమై తేలి ఉండటాన్ని గుర్తించి బయటకు తీశారు. అయితే ఆ ప్రాంతమంతా కూడా ఇసుక తవ్వకాల కోసం తవ్విన గుంత కావడం, గుంతలో నీరు నిలిచి ఉండడంతో అందులో పడి మృతిచెందినట్లు గ్రామస్తులు, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. అశోక్‌కుతల్లిదండ్రులు సావిత్రి శంకరయ్యతో పాటు ముగ్గురు సోదరులు ఉన్నారు. డిగ్రీ చదువుతున్న అశోక్ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండడం, మరో వైపు పుట్టిన రోజునే అనంత లోకాలకు చేరడంతో మృతుడి కుటుంబీకులతో పాటు బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు.

### మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా...

ఇసుక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, రోడ్డు నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి అశోక్ మృతిచెందడంతో అతడిపై చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 63వ నెంబరు జాతీయ రహదారిపై మృత దేహంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఆందోళన తీవ్రస్థాయికి చేరడంతో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, తహసీల్దార్ రాఘవేందర్ రావు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితి తెలుసు కున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి నచ్చ జెప్పడంతో ఆందోళన విరమించారు.



# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ - కొనుగోలు కేంద్రాల సందర్శన

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలం పడ్తన్ పల్లి, కర్ణమామిడి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ సీనియర్ నాయకులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులతో కలిసి సందర్శించి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, సెంటర్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఎలాంటి తాలు, తప్ప లేకున్నా ధాన్యం కొనుగోలు చేయకుండా తూర్పార పట్టిస్తున్నారని, దాని వాళ్ల రైతుల వద్ద అధిక భారం పడుతుందన్నారు. అదే విధంగా కొనుగోలు సమయంలో ప్రతి 40 కేజీల ధాన్యం బస్తాపై అదనంగా 1.30 కేజీలు కాంట పెట్టి రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని ఈ సందర్భంగా వారు విమర్శించారు. ధాన్యం కొనుగోలు



చేసిన వెంటనే రసీదు కూడా ఇవ్వడం లేదన్నారు.

**15 రోజులైనా కొనుగోలు చేయడం లేదు..**

బిజెపి సీనియర్ నాయకులు రఘునాథ్ మాట్లాడుతూ... రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి 15 రోజులు దాటినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యంలో ఎలాంటి తాలు, తప్ప లేకున్నా తూర్పార పేరుతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు చేయడం ఆలస్యం కావడంతో అకాల వర్షాల వల్ల ఎక్కడ తమ వడ్లు తడుస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని, అదే విధంగా రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని, రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం కటింగ్ పేరుతో దోచుకుంటుందన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో కొంత మేర పంట నష్టపోయామని ఉన్న ధాన్యాన్ని అమ్ముకుందాంటే కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వెంటనే ఎలాంటి షరతులు లేకుండా కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిజెపి నాయకులు కార్యక్రమంలో తమ్మిడి శ్రీనివాస్, పెద్దపల్లి పురుషోత్తం, మాధవరపు వెంకట రమణ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, బియ్యాల సతీష్ రావు, గడ్డం స్వామి రెడ్డి, బొలిశెట్టి అశ్విన్, మడిపెల్లి సత్యం, కొట్టే ప్రశాంత్, మారు వెంకట్ రెడ్డి, బొడ్డు తిరుపతి, జూపాక ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌జెండర్‌కు యువకుడి వేధింపులు

**మందమర్రి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ట్రాన్స్‌జెండర్‌కు ఓ యువకుడి నుంచి ప్రేమ పేరుతో వేధింపులు ఎక్కువ కావడంతో మందమర్రి పట్టణంలోని 1వజోన్ సీఈఆర్ క్లబ్ సమీపంలో నివాసం ఉంటున్న అజయ్ అనే యువకుడి ఇంటి ఎదుట శనివారం ట్రాన్స్‌జెండర్లు బైఠాయించి ధర్నా నిర్వహించారు. యువకుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కాలనీ వాసులంతా వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాన్స్‌జెండర్ల వద్దకు వచ్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ చందన అనే ట్రాన్స్‌జెండర్‌ను ప్రేమ పేరుతో అజయ్ వేధిస్తున్నాడని, అర్ధరాత్రి గోడ దూకి ఇంట్లోకి వస్తు న్నాడని తెలిపారు. ఫోన్‌కాల్స్, వాట్సాప్ వీడియోకాల్స్ చేస్తూ పెళ్లి చేసుకోకపో తే చనిపోతానంటూ బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. తరుచూ వేధిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని, డబ్బులు కావాలని కూడా బెదిరిస్తున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని అజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు తమకు రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుం టామని తెలిపారు. అయినప్పటికీ ముందస్తు చర్యల్లో భాగంగా అజయ్‌ను స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని తెలిపారు. కౌన్సెలింగ్ కూడా ఇచ్చామని సంఘటనకు సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు.

# రాజ్యాంగ సవరణతో రిజర్వేషన్లకు ముప్పు

## మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి కుల, మతాల మధ్య చిచ్చు పెట్టడమే బిజెపి ఎజెండాగా వ్యవహరిస్తుందని, రాజ్యాంగ సవరణ ప్రయత్నాల వల్ల రిజర్వేషన్లకు ముప్పు ఏర్పడనుందని మంచిర్యాల డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లో భాగంగా శనివారం హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామం నుంచి గడ్ పూర్ వరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ పేరిట చేస్తున్న ప్రయత్నాలు రిజర్వేషన్లకు ముప్పు తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తున్నాయని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమకోర్చి




రచించిన రాజ్యాంగం వల్లనే ఇప్పటికీ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పాదయాత్రలో మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల పద్మ, మండల కోఆర్డినేటర్, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# లైంగిక వేధింపులు నిరోధించాలి

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, హింసను నిరోధించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర' చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహిళా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించరు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల, మహిళల సమస్యలపై శ్రద్ధ చూపకుండా ఉద్యమాలను అణచివేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, సాయిలీల, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రజిత, ప్రసాద, ఉపాధ్యక్షులు సుజాత, అంగన్వాడీ యూనియన్ నేతలు లలిత, శైలజ, ఆశ యూనియన్ నేతలు సుజాత, చంద్రకళ, వ్యవసా య కార్మిక సంఘం నాయకులు తిరుపతి, నూతన్ కుమార్, మురళీ మోహన్, గిరిజన సంఘం నాయకులు శంభు, కేవీపీస్ నేత పోశెట్టి పాల్గొన్నారు.



# జొన్న పంట దగ్ధం

## విద్యుత్ తీగల రాపిడితో నిప్పు రవులు

**బోథ్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన మార సుధాకర్ రెడ్డి అనే రైతు పొలంలో జొన్న పంట పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం సమయంలో పొలం పక్కనే ఉన్న ట్రాన్స్ఫా ర్మర్ విద్యుత్ తీగలు రాపిడికి గురవడంతో ఒక్కసారిగా నిప్పు రవ్వలు చెల రేగి జొన్న పంటపై పడటంతో పూర్తిగా దగ్ధమైనట్లు పేర్కొన్నారు. రైతు మాట్లాడుతూ రెండు ఎకరాల జొన్న పంట పూర్తిగా కాలి పోయిందని, అంతేగాకుండా స్ప్రింకర్లు, పారీలు కూడా కాలిపోయా యని, పంట పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో తీవ్ర నష్టం సంభవించింది అని రైతు వాపోయాడు. ప్రభుత్వం న్యాయం చేసి తమను ఆదుకోవాలని కోరాడు.

## అగ్నివీర్‌కు బెల్లంపల్లి

# ప్రభుత్వ డిగ్రీ విద్యార్థి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికీ చెందిన డిగ్రీ విద్యార్థి అగ్నివీర్ కు ఎంపికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మార్త సాయికుమార్ భారత సైన్యంలో చేరికకు సంబంధించి 'అగ్నివీర్' పోటీలో పాల్గొని ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. 2025 జనవరి బ్యాచ్ లో జరిగిన ఎంపికలో ఈ విద్యార్థి పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థి సాయికుమార్ ను ఇండియన్ నేవీకి ఎంపిక చేస్తూ 'మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, ఇండియా' వారు కాల్ లెటర్ పంపించారు. ఈ మేరకు విద్యార్థి మార్త సాయికుమార్ ఈనెల 14 న ఇండియన్ నేవీలో 'టెక్నికల్ ఆర్గనైజేషన్ ఆఫీసర్'గా విధుల్లో చేరారు. ఉద్యోగ ప్రయత్నంలో తనకు సహకరించిన తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్‌కుసాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



# మనస్తాపంతో బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

- హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి బలవన్మరణం..
- గదిలో తల్లి ఉండగానే విద్యార్థిని ఆత్మహత్య
- సూర్యాపేట జిల్లాలో ఘటన..
- మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పగడపల్లిలో గ్రామంలో విషాద ఛాయలు..

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

బీటెక్ విద్యార్థిని మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన సూర్యాపేట జిల్లా జిల్లా చిలుకూరులో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా జైపూర్ మండల పరిధిలోని పగడపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని కృష్ణవేణి చిలుకూరులోని గేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున కృష్ణవేణి కళాశాల భవనంపైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఉగాది పండగకు ఇంటికి వెళ్లి కృష్ణవేణి శుక్రవారం సాయంత్రం కళాశాలకు వచ్చింది. తల్లితో కలిసి రాత్రి హాస్టల్ లోనే గడిపింది. అనంతరం తెల్లవా రుజామున తల్లి తన గదిలో ఉండగానే కళశాల భవనంపైకి వెళ్లి అక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి తన హాస్టల్ గదిలో ఉండగానే విద్యార్థిని



ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది.

# మాలగురిజాలలో నిమ్స్ వైద్య బృందం పర్యటన



**బెల్లంపల్ల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని మాలగురిజాల గ్రామంలో శనివారం హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యుల బృందం పర్యటించింది. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. నిమ్స్ వైద్యుల బృందం నెఫ్రాలజీ విభాగం అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్ రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ చందర్, వైద్యులు నిరంజన్, గణేష్, శంకర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కిడ్నీ బాధితుల మెడికల్ రిపోర్టులు పరిశీలించారు. వైద్యులు మాట్లాడుతూ గ్రామంలో 153 మంది రక్త నమూనాలను టీ హబ్‌కు పంపించామని తెలిపారు. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రిపోర్టులు వచ్చిన తర్వాత కిడ్నీ సమస్య తీవ్రంగా ఉన్న వారికి నిమ్స్‌లో చికిత్స అందిస్తామన్నారు. జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్, సుధాకర్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, పీహెచ్సీ వైద్యురాలు ఎవంజలీన్, తదితరులు పాల్గొన్నారు.



## 'అమరవీరుల దినోత్సవం అధికారికంగా నిర్వహించడం హర్షణీయం



**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లిలోని ఆదివాసీ అమరవీరుల దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందని జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ సెడ్మకి ఆనంద రావు అన్నారు. శనివారం మీడియం సమావేశంలో మాట్లాడుతూ నేడు ఇంద్రవెల్లిలో జరిగే అమరవీరుల సంస్మరణ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమాజం కోసం పోరాటం చేసిన అమరవీరులకు ఘన నివాళుర్పించాలన్నారు.

## అంబలి పంపిణీ అభినందనీయం



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

వేసవిలో ప్రజలకు దాహార్తి తీర్చేందుకు చేపడుతున్న అంబలి పంపిణీ అభినందనీయమని డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటుచేసిన అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం అంబలి పంపిణీ ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే వారికి దాహర్తి తీర్చడం సంతోషకరమన్నారు. యువత సమాజసేవలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు శంకర్, భీమ్రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాసాదే చరణ్ నాయకులు బస్వన్, జమీర్, సాయి, ప్రమోద్ పాల్గొన్నారు.

## కెమిస్ట్, డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం స్థానిక ఐబి ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్, అసోసియేషన్ కార్యదర్శి తొగరి సుధాకర్ హాజరయ్యారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కొత్త కిరణ్, కార్యదర్శిగా ఆది సతీష్, కోశాధికారిగా జావిద్ హుస్సేన్, గౌరవ అధ్యక్షులు గా షాహిద్ అలీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ షాప్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికలకు జిల్లా అధ్యక్షుడు మోటారి చంద్రశేఖర్ సెక్రటరీ తొగరు సుధాకర్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ యజమాన్యులు లక్ష్మణ్, రాజేష్, కేదారి, రమేష్, రవి పాల్గొన్నారు.



## హిందువులకు రక్షణ కల్పించాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, హిందువులకు రక్షణ కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి సంభోదిస్తూ మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షురాలు కనకతార, జిల్లా కార్యదర్శి వేముల రమేష్, జిల్లా గోరక్ష ప్రముఖ్ రాజసమ్మయ్య, జిల్లా సత్సంగ్ ప్రముఖ్ సురేష్, మాతృ శక్తి సంయోజక ముత్యం పద్మ, నగర సహకార్యదర్శి విద్యాసాగర్, హిందూ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు బోయిన హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌కు..

**బోథ్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

నియోజకవర్గంలోని నేరేడిగొండ టోల్ ప్లాజా సమీపంలో శనివారం సోలార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది ఆపారు. వివరాలు అడ గడంతో సోలార్ సైకిల్ పై కన్యాకుమారి నుండి కాశ్మీర్ కు ప్రయాణం చేస్తున్నానని తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు నుంచి ప్రయాణం మొదలు పెట్టానని సోలార్ సైకిల్‌పై రోజుకు 150 కిలో మీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తున్నానని తెలిపాడు. హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది అతనికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 1033కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.



## హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

### జిల్లా వైద్యశాఖ అధికారి హరీష్ రాజ్



**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

హజ్ యాత్రకు వెళ్లనున్న ముస్లింలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ లో హజ్ యాత్రకు వెళ్ళబోవు నలభై మంది యాత్రికులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు సమక్షంలో వైద్య పరీక్షలు జరిపారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు పరీక్షలు జరిపి వ్యాక్సినేషన్ చేశారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

**వైద్యుల సూచనలు పాటించాలి...**

యాత్రకు వెళ్లేవారు వైద్యుల సూచనలు తప్పక పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ కోరారు. వైద్య సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచినీటిని మంచి ఆహార పదార్థాలను తీసుకోవాలని, వెళ్లేటప్పుడు ఉపయోగించే మందులను వెంట తీసుకొని వెళ్లాలని, మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అన్ని పరీక్షలు చేసిన అనంతరం యాత్రకు వెళ్లడానికి అప్రూవల్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ స్నేహిత, డాక్టర్ అశోక్, డాక్టర్ రాము, డాక్టర్ అభినవ్, డేమో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ అఖిల్ పాషా, సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, కమిటీ పెద్దలు ముజాహిద్, ఇతర ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల కోసం పోలీసుల తనిఖీలు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలో నకిలీ విత్తనాల వినియోగంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నకిలీ విత్తనాలను కంట్రోల్ చేయడం కోసం నిరంతరం పోలీసులు నిఘా పెట్టారు. అందులో భాగంగానే శనివారం సూర్జాపూర్ గ్రామంలో ఎస్సై గంగారాం పోలీసులు పలు గృహాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాల ఉన్నాయనే సమాచారం మేరకు సూర్జాపూర్‌లోని అనుమానితుల ఇండ్లను సోదా చేశారు. ఈ సోదాల్లో నకిలీ విత్తనాలు లభించలేదు. నకిలీ విత్తనాల వాడకంపై, లాభనష్టాలను పోలీసులు రైతులకు వివరించారు. నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట దిగుబడి తగ్గుతుందనీ అవగాహన కల్పించారు. అంతేకాకుండా పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందనీ చెప్పారు. గ్లైపోసిట్ నకిలీ విత్తనాలు వాడడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ప్రధానంగా చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందనీ తెలిపారు. ఎవరూ కూడా నకిలీ విత్తనాలు అమ్మడం కొనడం కానీ చేయకూడదని హెచ్చరించారు. అదే విధంగా ఏ గ్రామంలోనైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకి సమాచారం ఇవ్వాలని కోరారు.

## దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

### ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఆర్డిఓ లోకేశ్వర్ రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నుండి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ పథకం కింద 50 వేల నుండి నాలుగు లక్షల వరకు పలు యూనిట్ల కింద దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని అర్హులైన యువతి, యువకులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.






■ 43ఏళ్ల తర్వాత తొలిసారిగా అధికారికంగా నిర్వహణ ■ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు ■ హాజరు కానున్న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు ■ స్మృతివనంలో కళకళలాడుతున్న స్తూపం ■ చివరి దశకు స్మృతి వనం పనులు ■ అమాయక గిరిజనుల నెత్తురు చిందడానికి కారణమేంటి? ■ ఆ రోజు ఏం జరిగింది? ■ నేటికీ చెరగని స్మృతులు ■ ఇంద్రవెల్లి ఘటనకు 44 ఏళ్లు ■ నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఇంద్రవెల్లి గాయానికి 44ఏళ్లు నిండాయి. అడవి గుండేకు తగిలిన గాయం నాలుగు దశాబ్దాలుగా రగులుతూనే ఉంది. భూమి కోసం అడవి బిడ్డలు చేసిన పోరాటంపై రాజ్యాం చేసిన మరణకాండే ఇంద్రవెల్లి ఘటన. అడవి బిడ్డలు బుక్కెడు బువ్వ కోసం పడరాని కష్టాలు పడుతున్న రోజులు. రెండు కాళ్ల ఆదునిక మృగాల తాకిడికి అడవి అడవంతా అల్లాడింది. దళారులు, వ్యాపారులు, ఆటవీ అధికారులు, పోలీసుల చేతిలో అడవి బిడ్డల బతుకులు దోపిడికి పిడనకు గురైయ్యాయి. అడవిలో ఆకుల దోపిడి.. అటవీ పంట దోపిడి.. అఖరుకు అడవిలో విచే గాలి సైతం దోపిడినే.. అడవి బిడ్డలు ఊపికి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. చిట్టడవులు చీకట్లో చిక్కి శల్యమయ్యాయి. ఆ మారుమూలల్లోకి వెలుగు రేఖలు ప్రసరించలేదు. అక్కడంతా చీకటి.. దళారులు దోపిడీ.. అక్కడ అమయకులను బాదుతున్న పోలీసులు లాఠీలు.. అడవి బిడ్డలు నోరు విప్పితే చాలు చావబాదే రోజులు.. అడవి బిడ్డలు ఆత్మరక్షణ కోసం నడుం బిగించక తప్పని పరిస్థతి.. ఆ తరుణంలోనే భూమి సమస్యకై పోరుబాట పడదామని రైతు కూలీ సంఘం అడవి బిడ్డలను సమీకరించింది. అటవి అధికారుల, భూ స్వాముల దౌర్జన్యాలను ఎదురించడం మొదలు పెట్టారు. దీంతో గూడాల్లో బుట్ల చప్పుడు ప్రారంభం అయింది. అడవి బిడ్డల పోరాటం మరింత ఉదృతం అయింది. తూడుం మోగించి సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని ఉదృతం చేశారు. అడవి బిడ్డలను పట్టిపీడిస్తున్న భూమి సమస్యను పరిష్కరించుకునేందుకు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పోరు బాట పట్టారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకేల్లడానికి నిర్ణయించుకున్నారు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంద సంస్థ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో 1981, ఎప్రిల్ 20న ఇంద్రవెల్లిలో బహిరంగ సభ నిర్వహించడానికి గిరిజన గ్రామాల్లో తుడం మోగించి ప్రచారం చేశారు. ఆదిలాబాద్ జిల్లా గిరిజన రైతు కూలీ సంఘం అధ్యక్షుడు హన్మంతరావ్‌కు సభ జరుపుకోవడానికి మొదట పోలీసులు అనుమతి ఇచ్చారు.

ఆ రోజు ఇంద్రవెల్లి సంత. జిల్లా అంతటా.. రాష్ట్ర మంతటా.. ఈ సభ గురించి విసృత ప్రచారం జరిగింది. ఇంద్రవెల్లి నలువైపుల నుంచి అడవి నుంచి కొనల నుంచి జనం చీమల దండుగా రావడం ప్రారంభం అయింది. అఖరి క్షణాన సభకు అనుమతి నిరాకరించినట్లు 144 సెక్షన్ నిషేదయాజ్ఞలు ప్రకటించి ప్రభుత్వం వందలాది మంది పోలీసులనుదించి పోలీసు వాహనాలకు స్పీకర్లు అమర్చి సభకు ఎవరు రావద్దని పోలీసులు ప్రచారం చేశారు. 144 సెక్షన్ అంటే తెలియని అడవి బిడ్డలు ప్రకటనలు అర్థంకాక, పోలీసులు అఖరి క్షణంలో అనుమతిండం లేదని తెలియక ఇంద్రవెల్లి వైపు సాగారు. పోలీసులు అన్ని వైపుల మోహరించి బస్సులు, వాహనాలు నిలిపివేసి చేట్లమీద తూపాకులు పెట్టుకుని కూర్చున్నారు. బస్సులో వచ్చే వారిని ఇంద్రవెల్లిలో దిగకుండ అడ్డుకున్నారు. దిగిన వారిని ఆరెస్టు చేశారు. ఈ విధంగా ఇంద్రవెల్లిని పోలీసులు దిగ్బందం చేశారు. మద్యాహ్నం 3 గంటలకు ఇంద్రవెల్లి జనసముహంతో నిండిపోయింది. సమావేశానికి గిరిజనులు హజరు కాకుండ చేయడానికి పోలీసుల చేసిన ప్రయత్నాలు అన్ని విఫలం అయ్యాయి. ఇంద్రవెల్లి జనసంద్రం అయింది. పోలీసులు తుకాపాలు ఎక్కువ పెట్టి జనాన్ని అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయిన జనసందోహంలో మాటా మాటా పేరిగి కాల్పులకు దారి తీసింది. ఆదిలాబాద్ ఆర్డీవో కాల్పులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే పోలీసులు కాల్పులు ప్రారంభించి పిట్టలను కాల్చినట్లు కాల్చారు. అడవి బిడ్డలు చేల్లచేదురై అడవుల వెంట పరుగెత్తారు. పచ్చని చేట్లపై రక్తపు మరకలు అంటాయి. కరుడు గట్టిన మెఘాలు, తీర్చలేని దరణి మాత దాహాన్ని గోండుల రక్తం తీర్చింది. అనేక మంది నేల కొరిగారు. వందలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 మంది మృతి చెందినట్లు ప్రకటించగా దాని సంఖ్య ఎన్నో రేట్లు ఉంటుందని పౌర హక్కుల సంఘాలు అప్పట్లో పేర్కోన్నాయి. చాలా శవాలు ఆదిలాబాద్‌లో పోలీసులు రహస్యంగా దహనం చేశారు. జీపులలో గుట్టగుట్టలుగా వేసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాళ్లు కోల్పోయి.. శరీర భాగాలు దెబ్బతిని, నడువలేని వారిని కూడా ఆస్పత్రిలో గోలుసులు కట్టి ఉంచారు. పోలీసుల భయానికి భయపడి పారిపోయిన వారికి వైద్య సహాయం అందలేదు. ఇతర ప్రాంతాల నంచి ఇంద్రవెల్లికి వచ్చి చిక్కిపోయిన వారు పోలీసుల వలలోకి చిక్కి దారుణ హింసకు గురైయ్యారు. ఇంతటి దారుణానికి పోలీసులు ఎందుకు ఓడిగట్టారో.. కాల్పులకు దారి తీసిన పరిస్థితులు ఎమిటో ప్రశ్నార్థకంగానే మిగిలిపోయయి. ఇప్పటికి ఇంద్రవెల్లి సంఘటన అడవి బిడ్డలను కదిలిస్తునే ఉంది. ఇంద్రవెల్లి మరణహెూమం తరువాత రెండవ తరానికి కూడ ఎలాంటి ఫలాలు అందలేదు. భాదితులకు నష్టపరిహారం అందలేదు. కొంత మందికి భూమి హక్కు పట్టాలు దొరికిన ఇంకా వేలాది మందికి పట్టాలు రాలేదు. రుణాలు లేవు. ఐటీడీఏ సంక్షేమ పథకాలు విసృత పర్చడం విఫలం అయింది. విద్య, వసతి సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పౌష్టికాహారం అందకపోవడం విషజ్వరాల బారిన పడ్డ వారికి వైద్య సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పౌష్టికాహారం లోపంతో రక్తహీనత ఏర్పడి అడవి బిడ్డలు ప్రాణాలు కోల్పోతున్నారు. పోడు వ్యవసాయం చేసే ఆదివాసులకు ఒక నమ్మకం, ఒక సంప్రదాయం ఉంటుంది. ఏ ప్రదేశం చనిపోతే వారు ఎక్కడికి వెల్లిన తిరిగి అదే ప్రదేశానికి వచ్చి నివాళ్లు ఆర్పించడం సంప్రదాయం. కాని ఇంద్రవెల్లి అమరవీరుల కోసం నివాళ్లు ఆర్పించేందుకు దశాబ్దాల పాటు అనుమతులు ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు ఆర్పించేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో మరణించిన ఆదివాసుల జ్ఞానకార్థం దేశంలో అపూర్వమైన స్థూపం నిర్మాణాన్ని రైతు కూలీ సంఘం అధ్యక్షుడు గంజీ రామారావ్ స్థూపం నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం చైనాకు వెల్లి అక్కడ ఉన్న స్థూపాన్ని చూసి ఆధ్యాయనం చేసి తానే స్వయంగా ఇంద్రవెల్లిలో నిలబడి 83 అడుగుల ఎంతైన స్థూపాన్ని నిర్మాణం చేయించాడు. కాని స్థూపం నిర్మాణం అయిన తరువాత అక్కడ ఎలాంటి సభలు, సమావేశాలు జరగలేదు. తీవ్ర నిర్బంధం కొనసాగించడంతో అడవి బిడ్డలు ఎవరు కూడా స్థూపం వైపు తొంగిచూడకుండానే గ్రామాల్లో సంస్మరణ సభలు నిర్వహించుకునేవారు. 1986 మార్చి 19న గుర్తు తెలియని వ్యక్తులు స్థూపాన్ని డైనమెట్లతో పేల్చేచారు. స్థూపం నెలమట్టం అయిన తరువాత అడవి బిడ్డల్లో నెలకోని ఉన్న నిరాశ, నిస్పృహలను తోలగించడానికి 1987లో ఎన్టీ రామారావ్ ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో స్మారక స్థూపాన్ని నిర్మించింది. ఇంద్రవెల్లిలో అడవి బిడ్డల చిందించిన రక్తం... అడవి ఒడిలో అనేక పరినామాలకు దారితీసింది. అనేక ఉద్యమాలకు బాటలు వేసింది. సంఘటన జరిగి 44 ఎళ్లు గడిచిన ఇప్పుడిప్పుడే గిరిజన ప్రాంతాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటికి తాగునీరు, వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. హక్కుల కోసం అడవి బిడ్డల పోరాటాలు కోనసాగుతునే ఉన్నాయి.



1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ ఆదివాసి మహిళా వెట్టి ఇస్నబాయిని హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో సంకెళ్ళతో బంధించి చికిత్స చేస్తున్న దృశ్యం. (44 ఏళ్ళ నాటి చిత్రం)

## నేడు అధికారికంగా ఇంద్రవెల్లి మృతవీరుల సంస్మరణ సభ

నలుభై నాలుగేళ్ల తరువాత ఇంద్రవెల్లి మృతవీరుల సంస్మరణ సభ ఆదివారం ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. సభకు అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. సంస్మరణ సభకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఇంద్రవెల్లి స్తూపానికి మహర్దశ వచ్చింది. ఆయన మొదటి నుంచే ఇంద్రవెల్లి పై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఎన్నికలకు ముందు టిపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన దళిత గిరిజన దండోరా బహిరంగా సభ విజయవంతం కావడంతో ఆయనకు ఇంద్రవెల్లిపై సెంటిమెంట్ పెరిగింది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ హాయంలోనే ఇంద్రవెల్లి కాల్పులు జరిగాయని గుర్తు చేసిన ఆయన క్షమాపణలు కూడా చెప్పారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సీఎం హోదాలో ఆయన మొదటి సారి ఇంద్రవెల్లి వచ్చారు. ముందు ఇచ్చిన హామీ మేరకు ఇంద్రవెల్లి స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దెందుకు నిర్ణయాలు తీసుకొన్నారు. ఇప్పటికే కోటి రూపాయల వ్యయంతో స్తూపం పరిస రాలను అందంగా తీర్చిదిద్దారు. రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దెందుకు ప్రణాళికలు రూపొందించారు. ఆనాడు సంఘటనలో అమరులైన కుటుంబాలను ఆదుకొన్నారు. నేడు జరిగే సంస్మరణ సభలో మృతవీరుల కుటుంబాలకు రుణాలు అందించనున్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్..

అమర వీరుల సంస్మరణ సభకు ప్రభుత్వం తరుపున అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం 44 సంవత్సరాల తర్వాత అమర వీరుల సంస్మరణ సభను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమరవీరుల కుటుంబాలకు ఇప్పటికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు ఇచ్చామన్నారు. మంత్రి సీతక్క అమర వీరుల కుటుంబాలకు 10 లక్షలలోన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు.





## 'బిల్లా రంగా బాషా' షురూ!




చిన్న సినిమాగా విడుదలై భారీ విజయం సాధించిన 'హను-మాన్' చిత్రాన్ని రూపొందించిన ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ అధినేతలు కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సినిమాలో కన్నడ ప్రముఖ నటుడు కిచ్చా సుదీప్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. 'బి.ఆర్.బి' అనే టైటిల్ తో రూపొందుతున్న ఈ యాక్షన్ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి "ఫస్ట్ బ్లడ్" అనే ట్యాగ్‌లైన్ కూడా జత చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు అనూప్ బండారి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రారంభమైందని సినీ వర్గాల సమాచారం. ఈ కథ 2209 ఏ.డి నేపథ్యంలో నడవనుండగా, వినోదంతో పాటు సరికొత్త విజువల్ అనుభవాన్ని అందించేలా రూపొందిస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. సాంకేతికంగా ఉన్నతంగా రూపొందుతున్న ఈ చిత్రం, భవిష్యత్తు ప్రపంచాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరించనున్నదని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. త్వరలో సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం.



## 'రాబిన్ హుడ్' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్!

యంగ్ హీరో నితిన్, గ్లామరస్ బ్యూటీ శ్రీలీల ప్రధాన పాత్రల్లో నటించిన "రాబిన్ హుడ్" సినిమా ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మార్చ్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాను తెరకెక్కించారు. ఇక డేవిడ్ వార్నర్ గెస్ట్ రోల్ చేయడం, సినిమా ప్రమోషన్లు వినూత్నంగా ఉండటంతో ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, రిలీజ్ తర్వాత అంచనాలు అందుకోలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద సినిమాకి ఆశించిన స్పందన రాలేదు. త్వరలోనే ఓటీటీలోకి రానున్న ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం ZEE5 సొంతం చేసుకుంది. తాజాగా జీ 5 సంస్థ అధికారికంగా ఓటీటీ రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రాబిన్ హుడ్ మూవీ మే 2 నుండి జీ 5 లో స్ట్రీమింగ్‌కి రానుంది. అంటే థియేటర్లలో విడుదలై నెలరోజుల్లోపే ఈ సినిమా ఓటీటీ వేదికపై అందుబాటులోకి రానుంది. తక్కువ టైమ్‌లో ఓటీటీలోకి రాబోతున్న ఈ మూవీ, థియేటర్‌లో మిస్ అయినవారికి ఇప్పుడు ఇంట్లోనే చూసే ఛాన్స్ దక్కింది. మరి థియేటర్లలో ఫెయిలైన ఈ మూవీ ఓటీటీలో మ్యాజిక్ చేస్తుందేమో చూడాలి!

## ఆ బాధను అబ్బాయిలు నిమిషం కూడా భరించలేరు

మహిళలకు పీరియడ్స్ టైమ్ లో ఎంత ఇబ్బందిగా ఉంటుందో చెప్పడం కూడా కష్టం. ఆ టైమ్ లో వచ్చే నొప్పులు, శారీరకంగా వచ్చే మార్పులతో పాటూ మూడ్ స్వింగ్స్ కూడా ఉంటాయి. కొంతమంది మగాళ్లు ఆ నొప్పిని కనీసం అర్థం చేసుకోకుండా మాట్లాడుతుంటారు. అలా మాట్లాడే వారిపై బాలీవుడ్ హాట్ బ్యూటీ జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. పీరియడ్స్ టైమ్ లో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధను కలిగిస్తుందని, తనక్కూడా అందరిలానే మూడ్ స్వింగ్స్ ఉంటాయని తెలిపింది జాన్వీ. ఆ మూడ్ స్వింగ్స్ వల్ల తన మాట తీరులో కూడా తేడా వస్తుందని, తన ప్రవర్తనను బట్టి తాను పీరియడ్స్ లో ఉన్న విషయం అందరికీ అర్థమవుతుందని చెప్పింది జాన్వీ కపూర్. తాను చిరాకుగా మాట్లాడిన ప్రతీసారీ నీకు ఇది ఆ టైమా అని అడుగుతుంటారని, ఆ అడిగే విధానమే కొన్ని సార్లు బాధిస్తోందని జాన్వీ పేర్కొంది. కొంతమంది ఈ పీరియడ్స్ పెయిన్ ను సరిగా అర్థం చేసుకోకుండా ఇది చాలా నార్మల్ విషయమని సెటైరికల్ గా మాట్లాడతారని, అర్థం చేసుకున్న వాళ్లు మాత్రమే మనల్ని ప్రశాంతంగా ఉంచుతూ, రెస్ట్ తీసుకోమని సలహాలిస్తుంటారని జాన్వీ తెలిపింది. నెలసరి సమయంలో వచ్చే ఆ నొప్పి అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుందని, ఆ టైమ్ లో ఆడవాళ్లు పడే బాధను, మెంటల్ స్టేటస్ ను అబ్బాయిలు నిమిషం కూడా భరించలేని, ఒక వేళ అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణు యుద్ధాలే జరిగేవేమో అని జాన్వీ కపూర్ చెప్పింది. జాన్వీ ఈ విషయం గురించి మాట్లాడటాన్ని అందరూ అభినందిస్తూ ప్రశంసిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే బాలీవుడ్ లో పలు సినిమాలు చేసినప్పటికీ సరైన సక్సెస్ అందుకోలేకపోయిన జాన్వీ కపూర్, గతేడాది ఎన్టీఆర్ తో కలిసి టాలీవుడ్ లో చేసిన దేవర మంచి సక్సెస్ అయిన విషయం తెలిసిందే. టాలీవుడ్ లో జాన్వీ చేసిన మొదటి సినిమానే మంచి హిట్ అయింది. దీంతో రెండో సినిమాగా రామ్ చరణ్ సరసన నటించే అవకాశమొచ్చింది. ప్రస్తుతం జాన్వీ చరణ్ తో కలిసి పెద్ది సినిమాలో నటిస్తోంది. నెక్స్ట్ ఇయర్ మార్చిలో ఈ సినిమా రిలీజ్ కానుంది.



# నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

## పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహణ - ఏర్పాట్లు చేసిన అధికారులు

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26 వరకు కొనసాగుతాయి. దీనికోసం అధికా రులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పదో తరగతి పరీక్షల కోసం భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి జెడ్పీహెచ్ఎస్, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్బాలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల కోసం భైంసా పట్టణంలోని మదీనా కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా కేంద్రంలోని ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుమ్మేరాత్‌పేట్ ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలను నియమించారు. 20 విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ను కేటాయించారు. పదో తరగతి పరీక్షకు 660 మంది, ఇంటర్ పరీక్షకు 458 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, ఫర్నిచర్, ఫ్యాన్లు, టాయిలెట్లు సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఐదు నిమిషాలకు మించి ఆలస్యంగా వస్తే అనుమతించమని డీఈవో రామారావు తెలిపారు. పరీక్ష రాసే ప్రతీ విద్యార్థి హాల్టికెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డును చూపించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్రూం నంబర్ 90599 87730లో సంప్రదించాలని సూచించారు.

### మంత్రుల పర్యటనతో..

# రైతులకు ఒరిగిందేమీ లేదు

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

భూ భారతి పేరుతో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్కల పర్యటనతో జిల్లా రైతులకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగనికి రైతు బంధు,రైతు బీమా రాక, ప్రోత్సాహం కరువైందని ఆయన విమర్శించారు.శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బి ఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు కార్యకర్తలతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్లో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు రావాలని కోరారు. ముందుగా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సభకు తగ్గ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు పూర్తి ఏర్పాట్లు సిద్ధం చేస్తామన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు, అరెస్టులకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎప్పుడు కూడా వెనకడుగు వేయకుండా కుటుంబంల పని చేయడం జరుగుతుందన్నారు. అలాగే కేసీఆర్ సభ వేదిక ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపనుందన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని మంత్రి జోగురామన్న అన్నారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నారాయణ, యూనిస్ అక్బాని, సాజితుద్దీన్, కస్తాల ప్రేమల, మమత తదితరులు పాల్గొన్నారు.

# షాలోమ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**మందమర్రి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

షాలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆద్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం రన్ ఫర్ జీసస్ పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ చేసినట్లు అధ్యక్షులు ఏలీయా, జనరల్ సెక్రెటరీ ఆనంద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి జూపాక సాల్మోన్, పాస్టర్లు ముల్కల జాన్ ప్రసాద్, జెర్మీయా, జెబాస్, విలియం, ఉపేందర్, సాల్మోన్, యేసుపాదం, సునీల్, కిషోర్, లూథర్ లు పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యంలో గిన్నిస్ రికార్డు



### 54 మందికి అందిన గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రాలు

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాకు చెందిన 54 మంది చిన్నారులు కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. స్వరూపిణి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శిక్షకురాలు నవ్య వినయ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు 2023 డిసెంబర్ 24న జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచారు. పరిశీలకుల బృందం ఎంపిక చేసిన మీదట 18 నెలల అనంతరం ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ పంపించినట్లు శిక్షకురాలు నవ్య తెలిపారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్పీ ఉపేందర్ రెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ముత్యంరెడ్డి చిన్నారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు అల్లాడి సురేష్, మహిళా హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ అనిషా, చెనిగారపు నాగరాజు పాల్గొన్నారు.



### ఎంపీ వంశీకృష్ణ

# చిత్రపటానికి పాలాభిషేకం

**మందమర్రి, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

సింగరేణి రిటైర్డు కార్మికుల సుదీర్ఘ కళ నెరవేర్చేందుకు కృషి చేసిన పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం బి1 ఆఫీస్ వద్ద పార్టీ శ్రేణులు శనివారం పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ... సింగరేణి రిటైర్మెంట్ కార్మికుల పెన్షన్ పెంపుదల కోసం గత సంవత్సరం నుండి పార్లమెంటులో పోరాటాలు చేస్తున్న గడ్డం వంశీ కృష్ణ  కృషి వల్ల ఈరోజు 140 కోట్ల నిధులు కేంద్రం కేటాయించిందని అన్నారు. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ.. బొగ్గు గనీ కార్మికుల పెన్షన్ పెంపు కోసం ఎంపి వంశీ పోరాటాలతోనే సాధ్యమైందన్నారు. గతంలో కాకా వెంకటస్వామి సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు పెన్షన్ పథకం ప్రారంభించారని గుర్తు చేశారు. 35 సంవత్సరాల తర్వాత 500,1000 రూ. పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ కార్మికులకు 10,000 రూ.పెన్షన్ ఇవ్వాలని కేంద్రం మీద ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇది ఎంపి కృషి వల్లనే సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు పుల్లూరు లక్ష్మణ్, గుడ్ల రమేష్, మంద తిరుమల్ రెడ్డి, నెరువట్ల శ్రీనివాస్, పైడిమల్ల నర్సింగ్, గడ్డం రజని, ఎర్ర రాజు, మంకు రమేష్, పాషా, జమీల్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, మాయ తిరుపతి, అర్జున్, జావిద్, సంతోష్, శీను, ఖలీల్, రవి కిరణ్, సుజిత్, అన్వేష్, గణేష్ లు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకన్న మండల పూజ

**మామడ, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం మండల పూజ కార్యక్ర మాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో రాజగోపురం, సుదర్శన చక్రం ప్రతిష్టాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా 80 కలశాలతో అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# జర్మనీలో ఉపాధి అవకాశాల కొరకు దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా ఉపాధి శిక్షణ శాఖ అధికారి రవికృష్ణ

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలోని రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్) ద్వారా ట్రిపుల్ విన్ ప్రాజెక్టు క్రింద అర్హులైన నర్సింగ్ సిబ్బందికి ఉచిత శిక్షణబీ నియామకం లక్ష్యంగా జర్మన్ ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ, జర్మన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ సమన్వయంతో జర్మనీలో ఉపాధి అవకాశాల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఉపాధి శిక్షణ శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని గుర్తింపు పొందిన కళాశాలల నుండి జి.ఎన్.ఎం./బి.ఎస్సి. నర్సింగ్ చేసి 21-38 సం।।ల వయస్సు, ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్తో జి.ఎన్.ఎం. అభ్యర్థులకు కనీసం 3 సం।।ల అనుభవం ఉండాలని, వృద్ధుల సంరక్షణ/ పాలియేటివ్ కేర్ (హెూమ్మేకర్/ నర్సింగ్ హెూమ్)లో నర్సింగ్ అనుభవం, విధులలో పని చేయడం/ ఇన్-పేషెంట్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇంటెన్సివ్ కేర్ / ఇంటర్మీడియట్ కేర్ యూనిట్ / జెరియాట్రిక్స్, లాంగ్ టర్మ్ కేర్ యూనిట్స్/ కార్డియాలజీ/ వార్డు/ జనరల్ సర్జికల్ మెడికల్ వార్డు/ నియోనాటాలజీ/ న్యూరాలజీ/ ఆర్థోపెడిక్స్/ ఓ.టి./ సైకియాట్రి వంటి విభాగాలలో ఆసుపత్రి ఆధారిత నర్సింగ్ అనుభవం ఉండాలని, గత 6 నెలలలో పొందిన బి1 సర్టిఫికెట్ కలిగిన జర్మన్ భాష నైపుణ్యత ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్లో బి1 స్థాయి వరకు జర్మన్ నేర్చుకునే అవకాశం ఉంటుందని, జర్మన్ యజమానితో విజయవంతంగా నియామకం పొందిన తరువాత, వారు రిజిస్టర్డ్ నర్గా గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు జర్మనీలోని ఆసుపత్రులలో నర్సింగ్ సహాయకులుగా పని చేస్తారని, ఆకర్షణీయమైన వేతనం అందించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9440051581, 9440048500, 9440052081 సంప్రదించాలని, తమ రెస్యూమ్ను ఈ నెల 25వ తేదీలోగా germanytriplewin2025@gmail. comకు ఈమెయిల్ చేయాలని, అదనపు సమాచారం కొరకు ఆన్‌లైన్‌లో www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

**అవగాహన సదస్సులో మంత్రి సీతక్క**

**ఖానాపూర్‌లో మోడల్ ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన మంత్రి**









**ఖానాపూర్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ, రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తెచ్చిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అన్నారు. భూభారతి 2025పై శనివారం రాత్రి ఖానాపూర్ ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ప్రజల భూ సమస్యలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవ్వడమే కాకుండా భవిష్యత్తులో భూ సమస్యలు, భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ప్రజల ప్రయోజనార్థం ప్రభుత్వం ఎన్నో రోజులు కసరత్తులు చేసి, రిటైర్డ్ ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులు న్యాయ నిపుణుల అంశాలు పరిగణలోకి తీసుకొని, ఎన్నో సంప్రదింపుల తర్వాత ఈ భూభారతి చట్టం రూపు దాల్చిందన్నారు. గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూభారతి చట్టం ద్వారా సాదా బైనామా ప్రక్రియ తిరిగి వాడుకలోకి రానుంది అన్నారు. భూభారతి చట్టం కింద భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూయజమానుల పట్టాదార్ పాసు పుస్తకాలలో వారి భూమికి సంబంధించిన వివరాలు మ్యాపుల రూపంలో పొందుపరచబడతాయన్నారు. ఈ పద్ధతితో భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయబడతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి, భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని సూచించారు. ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే, రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని సూచించారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీఓకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

## ఇద్దరికి తీవ్రగాయాలు - పరిస్థితి విషమం

**ముథోల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

తానూరు మండలంలోని భోసి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాంద గ్రామానికి చెందిన చందు (50), హన్మంతు, బాబన్న(సుదర్శన్) భైంసా వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుండగా భోసి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. చందు తలపై నుంచి వాహనం వెళ్లడంతో తలభాగం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. హన్మంతు, బాబన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. హన్మంతు పరిస్థితి విషమంగా ఉండడంతో నాందేడ్‌కు తరలించగా, బాబన్న భైంసా ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.





# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం




## బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

**మంచిర్యాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకం అని బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం లోని ప్రాణహిత కాలనిలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా సీసీ కెమెరాల వినియోగంపై కాలనీవాసులకు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ హాజరయ్యారు. 16 సీసీ కెమెరాలను కాలనీ వాసుల సహకా రంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమైంది అన్నారు. ఇందుకోసం సహకరించిన ప్రాణహిత కాలనీ ప్రజలకు అభినందనలు తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి దొంగతనాలు జరిగిన కేసుల చేతన వేగవంతం చేసే దిశగా ఉంటుంద న్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత కల్పిస్తాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చోట దొంగతనాలకు సంబంధించిన కేసులు త్వరగతిన పరిష్కారం అయ్యాయన్నారు. కేసుల ట్రయల్ సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉంటాయన్నారు. పగలు రాత్రి ప్రజలకు రక్షణగా ఉండేందుకు వీలు ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు లేని కాలనీలు కెమెరాలు ఏర్పాటు చేసి కాలనీవాసుల్లో అవగాహన కల్పించే విధంగా పోలీసులు కృషి చేయాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకాన్ని కలిగించేందుకు రాత్రి గస్తీ పెంచి నిఘా ఉంచాలన్నారు. నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# శాస్త్రజ్ఞానం పెంపొందించుకోవాలి

## ఎన్టీఆర్ సైంటిస్ట్ డాక్టర్ సాహెబ్ రావు

**కుంటాల, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు శాస్త్రోయజ్ఞానం పెంపొందించుకుని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ సైంటిస్ట్ డాక్టర్ సాహెబ్రావు సూచించారు. కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి రహస్యాలను ఛేదించడం, కొత్త విషయాలను కనుగొనడానికి సైన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్య, విజ్ఞానం, జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు టెక్నాలజీ ఉపయోగపడుతుందని ఆయన సూచించారు. అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్, మంగళయాన్ మిషన్ల ద్వారా భారతదేశానికి మంచి గుర్తింపు దక్కిందని తెలిపారు. విద్యార్థులు ఆదిశగా వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాసు నవీన్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# దరఖాస్తుకు మిగిలింది ఆరు రోజుల గడువు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ప్రొహిబిషన్ ఎక్సైజ్ హైదరాబాద్ కమిషనర్ వారి ఆదేశానుసారం గతంలో రెన్యూవల్ కానీ బార్లకు అర్హులైన వారికి లాటరీ పద్ధతిన కేటాయించేందుకు గతంలో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని ఇంకా దరఖాస్తుకు ఆరు రోజులే గడువు మిగిలి ఉన్నందున అర్హులైన వారు తమ దరఖాస్తును సమర్పించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆదిలాబాద్ సిఐ రేండ్ల విజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు అప్లికేషన్ ఫారంతో పాటు లక్ష రూపాయల డిడి గాని, చాలాన్ గాని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఆదిలాబాద్ పేరుతో తీసి దరఖాస్తుదారుని మూడు పాస్ ఫోటోలు కలర్ ఆధార్ పాన్ కార్డులతో కలిపి, జిల్లా ప్రొహిబి షన్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో లేదా, డిప్యూటీ కమిష వర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అదిలాబాద్ డివిజన్ కార్యాల యంలో గాని, కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ హైదరా బాద్ కార్యాలయంలో గాని ఈనెల 26 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని తెలిపారు. ఇందులో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక ప్రక్రియ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈనెల 29న జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డిపి ఈ ఓ 8712658771, ఎస్హెచ్ఓ ఆదిలాబాద్ 8712658780లకు సంప్రదించాలని కోరారు.

## బేస్‌బాల్ నేషనల్ మీట్‌కు విద్యార్థుల ఎంపిక

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఢిల్లీలో ఏప్రిల్ 21 నుంచి 27 వరకు జరగనున్న బేస్బాల్ నేషనల్ మీట్ కు నిర్మల్ పట్టణంలోని విన్నర్స్ ఒలింపియాడ్ పాఠశాల నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పదవ తరగతి విద్యార్థిని మనోజ్ఞ, తొమ్మిదవ తరగతి విద్యార్థులు నిహిత్, మన్విత, శ్రీ హర్షిని రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభతో జాతీయ స్థాయికి చేరుకు న్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. కరస్పాండెంట్ దాసరి రాజు, ఛైర్మెన్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు దినేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు సహదేవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇది మా పాఠశాలకు గర్వకా రణం అన్నారు. విద్యార్థుల కృషి, శిక్షణ, ఆసక్తి ఫలితంగా ఈ స్థాయికి ఎదిగారన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బెజ్జూర్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

సీఎంఆర్ఎఫ్ చెక్కులను సిరిపుర్ టి.ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు లబ్ధిదారులకు చెక్కులను శనివారంఅందజేశారు. కాగజ్నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో భీమినీ మండలం చిన్న గుడిపేట గ్రామానికి చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.లక్ష 3500 చెక్కులను అందజేశారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మామడ, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం రైతులు కోసం భూభారతి చట్టం ప్రవేశపెట్టడంతో నాయకులు, రైతులు శనివారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్క రించుకోవచ్చని, కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీలను నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్, బాపయ్య, సంతోష్ వికాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఇచ్చోడ, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రం నిర్మల్ హైవే ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ గర్ల్స్ పక్కన రావి చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడిని గుర్తుపడితే 8712659944కు ఫోన్ చేయాలని ఎస్సై తిరుపతి తెలిపారు.



## ‘టీం శివంగి’

- తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా నిర్మల్ జిల్లాలో మహిళా కమాండోస్..
- 45 రోజులపాటు మహిళా కానిస్టేబుళ్లకు కఠోర శిక్షణ
- టీం శివంగిగా పేరు..
- ప్రారంభించిన మంత్రి సీతక్క

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

వివిధ రంగాల్లో మహిళా శక్తి భాగస్వామ్యం వేగంగా పెరుగుతున్నా.. కొన్ని కష్టతరమైన రంగాల్లో ఇప్పటికీ తక్కువగానే ఉన్నది. ముఖ్యంగా భద్రతా దళాలు, పోలీస్ విభాగాల్లో పురుషాధిక్యమే కొనసాగుతోంది. ఈ పరిస్థితిని మార్చే పనికి నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పునాది వేశారు. త్రివిధ దళాల తరహాలో జిల్లాలో మహిళా కమాండోసన్ను తయారు చేశారు. పురుషులకు దీటుగా మహిళా కానిస్టేబుళ్లకు కఠోర శిక్షణ ఇచ్చి మెరికల్లా తయారు చేశారు. వారికి ‘టీం శివంగి’గా నామకరణం చేశారు.

**45 రోజుల కఠోర శిక్షణ..**

టీం శివంగి కానిస్టేబుళ్లకు 45 రోజులపాటు కఠోర శిక్షణ ఇచ్చారు. శారీరక దృఢత్వం, పరుగు పందేలు, వెర్టికల్ రోప్ క్లైంబింగ్, మనుగడ పద్ధతులు, పోరాట నైపుణ్యాలు, పేలుడు పదార్థాల నిర్వహణలో శిక్షణ, అధునాతన టెక్నాలజీతో కూడిన ఆయుధాల వినియోగం, వెపన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్



సిగ్నల్స్, మ్యాప్ రీడింగ్, మ్యాప్ లేకుండా నావిగేట్ చేయడం, ఆకస్మిక వ్యూహాలు, శత్రువుల కదలికలు, అడవి సంకేతాలను చదవడం, నిఘా పద్ధతులు, ఆకస్మిక దాడి, ఎదురుదాడి కసరత్తులు, రహస్య స్థావరాలపై దాడులు చేయడం లాంటివి ఈ శిక్షణలో నేర్పించారు. ఈ శిక్షణ పొందినవారికి ఆయా విభాగాల్లో స్పెషల్ టీంలుగా నియమిస్తున్నారు.

**మంత్రి చేతుల మీదుగా ప్రారంభం..**

శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క టీం శివంగిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్పీ జానకీ షర్మిల చేస్తున్న కృషిని అభినందించారు. మామడ చిట్టడవిలో తప్పిపోయిన నలుగురు మహిళలను వెతికి పట్టుకోవడంలో ఎస్పీ, సిబ్బంది పడ్డ కష్టాన్ని కొనియాడారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కూడా ఇలాగే శివంగి టీంలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణలో కష్టంతో కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ డీఎం

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పండరి, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు పూల మొక్క అందజేశారు. బస్సులేని గ్రామాలైన సారంగాపూర్ మండలం జీవిలి, లక్ష్మణచాంద మండలం మాచాపూర్, నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామాలకు బస్సులు నడపాలని ఎమ్మెల్యే సూచించారు. రూట్ సర్వే చేసి ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా బస్సులు నడుపుతామని డీఎం తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ ఉన్నారు.



## పైప్ లైన్ లీకేజ్‌లకు మరమ్మతులు



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**

గత కొద్ది రోజులుగా పట్టణంలోని అబ్రహం నగర్ సింగరేణి సరఫరా చేసే తాగునీటి పైపు లైన్ లీకేజీలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక నాయకులు పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు మరమ్మతుల కొరకు స్వచ్ఛందంగా కూలీల కొరకు డబ్బులను జమచేసుకొని లీకేజీలు ఉన్న చోట తవ్వకాలు జరిపారు. విషయం తెలుసుకున్న సింగరేణి అధికారులు స్పందించి తమ యంత్రాంగన్ని పంపించి లీకేజీ ఉన్న పైపు తీసివేసి కొత్త పైపు లైన్ లను అమర్చారు. దీనితో స్థానికులు సింగరేణి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మంచినీటి సరఫరా లీకేజీల సమస్యను రాజకీయం చేయవద్దని కాలనీవాసులు నాయకులను కోరారు.

# వెంటాడుతున్న ఇంద్రవెల్లి మృత్యు జ్ఞాపకాలు




**నేడు ఇంద్రవెల్లి అమర ఆదివాసీల అసువులు బాసిన దినం**

ఈ నెల 20న ఇంద్రవెల్లిలో ఆదివాసీలపై కాల్పులు జరిగి పదుల సంఖ్యలో మరణించిన దినం! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్ ప్రాంతం) భూమి బదలాయింపు చట్టం 1959 వచ్చింది. దీనికి 1970లో మార్పులు చేశారు. దీనినే 1/70 చట్టంగా పిలుస్తారు. దీని ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూ బదలాయింపులు (అమ్మకం, కౌలు, గిఫ్ట్) చెల్లకుండా చర్యలు చేపట్టారు. అడవిపై ఆదివాసీలకే హక్కు ఉండాలని ఈ చట్టం చెబుతోంది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని, సాంప్రదాయాలను పరిరక్షించడం అంతరించిపోతున్న ఆదివాసీ తెగలను కాపాడడం కోసం 1/70 చట్టాన్ని తీసుకొచ్చింది. ఇన్ని చట్టాలు వచ్చినప్పటికీ పెద్ద ఎత్తున ఆదివాసీల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ పరిణామాల తర్వాతే ఇంద్రవెల్లి సంఘటనకు దారి తీసింది. అది ఏప్రిల్ 20, 1981. వలసదారుల దోపిడీ నిరాటంకంగా కొనసాగడం, భూముల అన్యాక్రాంతం, ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ శాఖల ప్రాబల్యం పెరగడం వలన, జీవనాధారమైన భూములు, పుట్టిన ప్రాంతంలోనే తమ అస్తిత్వం అన్యాక్రాంతం అయ్యాయి. వ్యాపారుల దోపిడీ, కూలీ రేట్లు, అటవీ భూములు లాంటి అంశాలపై గిరిజన రైతుకూలీ సంఘం ఇంద్రవెల్లిలో ఏప్రిల్ 20, 1981 నాడు ఒక సమావేశానికి పిలుపునిచ్చింది. మొదలు సభను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. ఆదివాసుల నుంచి వస్తున్న స్పందనను చూసి సభపై నిషేధం విధించారు. ఈ విషయం తెలియని ఆదివాసులు జనసంద్రమై అడవిని దాటుకొని ప్రవాహంలా ఇంద్రవెల్లికి వచ్చారు. అడ్డుకునేందుకు పోలీస్ బలగాలు అడవుల్లో దిగాయి. వేలాదిగా వస్తున్న నిరాయుధులైన ఆదివాసులపై పోలీసులు తూటాల వర్షం కురిపించారు. ఆదివాసీలు బాటపట్టి అడవిలో పరుగులు తీస్తుంటే, పోలీస్ బలగాలు వెంటాడి కాల్చి చంపారు. 60 మందికి పైగా కాల్పుల్లో ఊపిరి కోల్పోయారు! ఈ కాల్పుల్లో 60 మందికి పైగా ఆదివాసీలు మరణించగా 30 మందికి పైగా గాయపడ్డారు. దేశంలోనే అప్పట్లో ఆదివాసులపైన జరిగిన ప్రభుత్వం దాష్టీకంగా పేర్కొనవచ్చు. జలియన్ వాలా బాగ్ లో జరిగిన సంఘటన ను తలపించేదిగా పేర్కొనవచ్చు. అంతకు ముందు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మందమర్రిలో సీపీఐ నాయకులు వీటీ అబ్రహం, ఎండీ మునీర్ తదితరుల మీద భూస్వామి గూండాల దాడి, హత్యాప్రయత్నంకు నిరసనగా జనవరి 6, 1979లో బొగ్గు గని కార్మికులు విధులు బహిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి హెచ్చరిక లేకుండా పోలీసులు కాల్పులు జరుపగా అక్కడికక్కడే నలుగురు, ఆ తర్వాత ఇద్దరు, ఇలాంటి ఆరుగురు కార్మికులు తూటాలకు బలయ్యారు. 18 మందికి పైగా గాయపడ్డారు. సిపిఐ మాజీ ఎమ్మెల్యే, దివంగత గుండా మల్లేష్ ఈ కాల్పుల సంఘటనలో తృటిలో తప్పించుకున్నారు. ఈ సంఘటన అనంతరం 1981 లో ఇంద్రవెల్లి సంఘటన జిల్లా లో జరిగింది. దేవాపూర్ లోని మద్దిమాడ వద్ద కూడ ఆదివాసీల మీద జరిగిన కాల్పుల్లో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం, జల్, జమీన్ కోసం పోరాడుతూనే ఉన్నారు. ఇంకా వారి జీవితాల్లో మార్పు రాలేదు. ఖనిజాల కోసం అడవుల నరికి వేత, వారి గ్రామాల నుంచి సోకాల్డ్ అభివృద్ధి పేరిట తరిమి వేస్తున్నారు. అటవీ శాఖతో ఇంకా వివాదాలు, పోడు వ్యవసాయం మీద ఉక్కు పాదం కొనసాగుతూనే ఉన్నది. కనీస సౌకర్యాలకు నోచని జీవితాలు, ఎక్కడ వేసిన గొంగళి, అక్కడే చందం లాంటి గ్రామాలు ఉన్నాయి. తమ హక్కుల మీద అణిచివేతలు, సంపదలో భాగస్వామ్యం కూడా లేదు. ప్రభుత్వం ఆదివాసీల కోసం తెస్తున్న పథకాలు కూడా సరిగా అమలు కాకపోవడం, వైద్యం, విద్య, ఉపాధి లాంటివి వారికి అందక పోవడం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

**తొలి నివాళి ఆతనిదే!**

1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో వందలాది మంది గిరిజనులు చనిపోవడంతో వారి జ్ఞాపకార్థం ఇంద్రవెల్లిలో నిర్మించిన అమర వీరుల స్తూపానికి యేటా ఏప్రిల్ 20న మొదట నివాళులు సిడాం శంభుతో పాటు కుమ్ర ఈశ్వరి బాయిలు నిర్వహించే వారు. మావోయిస్టులపై ప్రభుత్వం నిషేధం విధించిన సమయంలో పోలీసులు అడ్డుకొనే ప్రయత్నాలు చేసినప్పటికి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులు అర్పించే వారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్పించడానికి అవకాశం కల్పించడంతో గిరిజనులు ఇంద్రవెల్లి మృతుల వీరుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్నారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాటాలు చేసి అమరుడైన కుమ్రం భీం ఆశయ సాధన కోసం కెరమెరి మండలం జోడేఘాట్ లో జరిగే కార్యక్రమాన్ని శంభు నిర్వహిస్తూ ఆదివాసీ గిరిజనుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడంలో ముందుండే వారు. సీడాం శంభు 2018 జూలై 19 నాడు అనారోగ్యంతో రాత్రి చివరి శ్వాస వదిలినాడు.

**స్మారక స్థూపం ఏర్పాటు**

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో అమరుల స్మారక స్థూపాన్ని నిర్మించారు. 1986 మార్చి 19న గుర్తు తెలియని వ్యక్తులు ఈ స్థూపాన్ని పేల్చేశారు. ప్రజా సంఘాల ఒత్తిళ్లు, ఆదివాసుల పోరాట ఫలితంగా 1987లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ నిధులతో తిరిగి స్థూపాన్ని కట్టారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో అసువులు బాసిన ఆదివాసీ బిడ్డలకు నివాళులు!



- ఎండీ మునీర్
సీనియర్ జర్నలిస్ట్, సామాజిక, రాజకీయ, విశ్లేషకులు

# అభివృద్ధి పనుల్లో అలసత్వం ఉపేక్షించం

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- నిర్లక్ష్యానికి తావులేదు ■ అలాంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- త్వరలో అంగన్వాడీల్లో ఖాళీల పోస్టుల భర్తీకి చర్యలు..
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, సీత్ర శిశు సంక్షేమ శాఖలపై సమీక్ష
- అభివృద్ధి పనుల తీరుపై ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల అసంతృప్తి









**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, మహిళా, శిశు సంక్షేమం పై ఉమ్మడి జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవ వందనం ఇచ్చారు. అనంతరం, మహిళా పోలీసులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శివాంగి' బృందాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఇది రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. జిల్లాలోని సమాఖ్య సంఘాలకు, మెప్మాలకు మంజూరైన చెక్కులను మంత్రి, కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ, రుణాల మంజూరు, వసూలులో నిర్మల్ జిల్లా ప్రగతిశీలంగా ఉందని మంత్రి ప్రశంసించారు. అనంతరం పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, టెండర్ దశ నుంచే పనులు వేగవంతంగా ప్రారంభించి, వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికీ ప్రారంభం కాని పనులకు వెంటనే కొత్త టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఆలస్యం చేస్తున్న గుత్తేదారులకు నోటీసులు జారీ చేసి పనులు పూర్తి చేయించాల్సిన అవసరం ఉందని సూచించారు. పనులన్నీ నాణ్యతతో ఉండాలని స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు అభివృద్ధి పనులను పూర్తిచేయడం ఇంజనీరింగ్ అధికారుల బాధ్యత అని తెలిపారు. కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. సాగునీరు చివరి తడి వరకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో త్రాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పనులను వేగంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్రాగునీటి సమస్యలు ఎదురవకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని, సాగునీరు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అనంతరం జిల్లాల వారీగా అభివృద్ధి పనులపై మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విటల్, ఎంపీ నగేష్, ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, సిర్పూర్, అసిఫాబాద్, బోథ్ల ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్ పటేల్, పాల్వాయి హరీష్ బాబు, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ప్రజాప్రతినిధులు, ఐసిడిఎస్ సెక్రటరీ అనితా రామచంద్రన్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కుష్బూ గుప్త, దీపక్ తివారి, కిషోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# స్వగ్రామానికి చేరుకున్న ప్రేమ్‌సాగర్ మృతదేహం



- శోక సంద్రమైన సోన్ ■ కొడుకు పార్థివదేహాన్ని చూసి సొమ్మసిల్లిన తల్లి..
- ఆస్పత్రికి తరలింపు ■ కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు ■ మిన్నంటిన రోదనలు
- ప్రేమ్‌సాగర్‌కు కన్నీటి వీడ్కోలు పలికిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు..

**నిర్మల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌సాగర్ ఇటీవలే గల్ఫ్ దేశంలో పాకిస్తాన్ యువకుడి చేతిలో హత్యకు గురైన సంగతి తెలిసింది. వారం రోజుల క్రితం బేకరీలో పనిచేస్తున్న ప్రేమ్‌సాగర్‌ను పాకిస్తాన్‌కు చెందిన ఓ యువకుడు హత్య చేసినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది, హత్య గావించబడ్డ ప్రేమ్ సాగర్ మృతి దేహాన్ని ఇండియాకు రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అక్కడి ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రేమసాగర్ మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉండగా కొడుకు శవాన్ని చూసిన తల్లి తీవ్ర అస్వస్థత గురై అస్వస్థతకు గురై కుప్పకూలిపోవడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# 21 నుంచి ఆర్జీయూకేటీ అధ్యాపకుల సమ్మె

**ముథోల్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిపికేషన్ వేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆర్జీయూకేటీ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం తెలిపారు. శనివారం సమ్మె నోటీసు ఏవో రణధీర్‌కు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ స్థాపించినప్పటి నుంచి దాదాపుగా 17 ఏళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్. విజయ్ కుమార్, మంద సతీశ్ కుమార్, శ్రీధర్, డాక్టర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





# కుంటాల జలపాతం వద్ద రూప్ వే

## జలపాతాన్ని సందర్శించిన మంత్రి సీతక్క

**నేరడిగొండ, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
కుంటాల జలపాతాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం రూప్‌వే నిర్మాణానికి చర్యలు చేపడతామని రాష్ట్ర మంత్రి సీతక్క వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి కుంటాల జలపాతాన్ని సందర్శించారు. అతిపెద్ద జలపాతంగా పేరుగాంచిన జలపాతం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

## 21న ఆసిఫాబాద్‌కు

# మంత్రి పొంగులేటి రాక

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై ఈనెల 21న జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

